## స్ఫూర్తి దాయకంతోనే

# ఎన్నికలు విజయవంతం

- అధికారులు, సిబ్బందికి అభినందనలు
- కలెక్టర్ ఉదయ్‌కుమార్

అధికారులను అభినందిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 15: ప్రతి ఉద్యోగి స్ఫూర్తి దాయక బాధ్యతల నిర్వహణతోనే లోక్‌సభ ఎన్నికలు విజయవంతమయ్యాయని కలెక్టర్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి కావడంతో ఎన్నికల అధికారులు, సిబ్బంది బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు, సిబ్బంది సమన్వయం, సమిష్టి కృషివల్లే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికలు విజయవంతమయ్యాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుంచి మే 14 వరకు ఉదయం స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియ వరకు ఎన్నికల నిర్వహణలో వనపర్తి, గద్వాల జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లాల నోడల్ అధికారులు, ఏడు అసెంబ్లీ నియోజవర్గాల ఏఆర్‌వోల సహాయ సహకారాలు, సమిష్టి భాగస్వామ్యంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయగలిగామన్నారు. ఎన్నికలుప్రశాంతంగా, సజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం సంతోషమన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ విభాగం నోడల్ అధికారులు సిబ్బందికి మంచి శిక్షణను అందజేసి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించడంలో అధికార యంత్రాంగం సఫలీకృతమైందన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికార యంత్రాగాన్ని కలెక్టర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ విభాగాల ఎన్నికల నోడల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

### పనులు వేగవంతం చేయాలి

జాతీయ రహదారి పనులు, భూసేకరణను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులతో భూసేకరణ పనులు, జాతీయ రహదారి పనులపై సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారికి సంబంధించి జిల్లాలోని కొల్లాపూర్ మండల పరిధిలోని వరిద్యాల గ్రామ పంచాయతీ పరిధిలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలని, అందుకు సంబంధించిన భూ యజమానులు, రైతులకు రావాల్సిన నష్ట పరిహారాన్ని త్వ రితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నేషనల్ హైవే అ భివృద్ధి పనులు, నేషనల్ హైవే 167కె కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ 79 కిలో మీటర్ల వరకు కొనసాగుతున్న విస్తరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. లాండ్ ఆక్విజేషన్ పెండింగ్ పనులు అన్ని త్వరితగతిన పూర్తి కావాలని, అవార్డు పరిహారం చెల్లింపుల పురోగతిపై త్వరలో సమీక్షించనున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో ఇప్పటి వరకు 33 కిలో మీటర్ల రహదారి పనులు పూర్తయినట్లు జాతీ య రహదారి ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈకి వివరించారు. కార్యక్రమంలో జాతీయ రహదారి ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ధర్మారెడ్డి, కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు, రెవెనూ, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 24న విత్తన మేళా

కొల్లాపూర్‌రూరల్, మే 15 : పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఈ నెల 24న విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి లక్ష్మణ్, వ్యవసాయ విస్తరణాధికారి రాములు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. విత్తన మేళాలో వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలను విక్రయిస్తారన్నారు. అలాగే వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల సమగ్ర సమాచారం వివరిస్తారన్నారు. మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 18న మండల సర్వసభ్య సమావేశం

ఉప్పునుంతల, మే 15 : ఎంపీపీ అరుణ అధ్యక్షతన ఈనెల 18న ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరవుతున్నారని, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

## నేడు బిజినేపల్లిలో..

బిజినేపల్లి, మే 15: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఖతలప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ప్రతి ఒక్కరూ విధిగా సమయానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

## పంచాయతీ అభివృద్ధి సూచికపై సమావేశం

తిమ్మాజిపేట, మే 15 : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పనులను పంచాయతీ అభివృద్ధి సూచిక (పీడీఐ)లో నమోదు చేసే అంశంపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలోగ్రామాల వారీగా పది శాఖల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను పీడీఐ పోర్టల్‌లో నమోదు చేసే విధానాన్ని కార్యదర్శులకు అవగాహన కల్పించి, అప్‌లోడ్ చేయించారు. గతంలో నేషనల్ పంచాయతీ అవార్డు తరహాలోనే వీటిని నమోదు చేయిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మచారి, అధికారులు ఉన్నారు.

## పీఏసీసీఎస్‌లో ఆధార్, ఫోన్ నంబర్ ఇవ్వాలి

కల్వకుర్తి, మే 15 : కల్వకుర్తి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో పంట రుణాలు పొందిన రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌లతోపాటు ఫోన్ నెంబర్ ఇవ్వాలని పీఏసీసీఎస్ సొసైటీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సీఈవో వెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం రైతు పంట రుణాలు మాఫీ చేస్తుందని ప్రకటించిన నేపథ్యంలో బ్యాంకు రుణాలు పొందిన రైతు యొక్క ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారని వారు చెప్పారు.

## అంబలి కేంద్రానికి విరాళం

బాటసారులకు అంబలిని అందజేస్తున్న సభ్యులు

అచ్చంపేటటౌన్, మే 15 : అంబలి కేంద్రంతో ఎంతో మందికి మేలు జరుగుతుందని పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిశోర్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహిస్తున్న రక్షిత మహిళ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రానికి రూ.2వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ప్రశాంతి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## వడదెబ్బపై కళాజాత ప్రదర్శన

వెల్దండలో వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెల్దండ, మే 15 : కలెక్టర్ ఆదేశాల మేరకు మండలం కేంద్రంలో జిల్లా పౌర సమాచార శాఖ ఆధ్వర్యంలో బుధవారం వడదెబ్బపై కాళాకారులు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీ పని ప్రదేశాల్లో, ప్రధాన కూడల్లో కళాజాత ప్రదర్శన ద్వారా వడదెబ్బ, పరిసరాల శుభ్రత, సిజీనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు శివనాగులు, నరేందర్, శివ, సికిందర్, పార్వతమ్మ, ఆస్మా, రేణుకా, ఉపాధి కూలీలు ఉన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

లింగాల, మే 15: మండలంలోని కేసీ తండాలో మేరమ భవానీ, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.గణపతి, ఉపాధ్యక్షుడిగా కేతావత్ శంకర్‌నాయక్, కోశాధికారిగా హంక్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా లాలునాయక్, కార్యదర్శిగా రాములు, సహాయ కార్యదర్శిగా వెంకటయ్య, సహాయ కోశాధికారిగా వాలూనాయక్‌ను ఎన్నుకున్నారు.

## సీఐటీయూ జెండావిష్కరణ

కొల్లాపూర్ రూరల్, మే 15: మేడే ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం మండలంలోని ముక్కిడిగుండంలో సీఐటీయూ గ్రామ నాయకుడు కృష్ణయ్య నాయకత్వంలో సంఘ జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ సీనియర్ నాయకుడు శంకరయ్య ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తారాసింగ్, నర్సింహ, మల్లయ్య, బాలపీరు, పరమేశ్, ఎల్లయ్య, రాజు, సేవ్య, శంకర్, వెంకటస్వామి, చెన్నయ్య, కృష్ణయ్య, నర్సింహ, మహిళా సంఘం నాయకురాలు వెంకటమ్మ, లక్ష్మి, సుభద్రమ్మ, దేవమ్మ పాల్గొన్నారు.

## మురుగు తీసి వదిలేశారు..

పెంట్లవెల్లి, మే 15 : మండల కేంద్రంలోని 5వ వార్డు సంత బజారు సమీపంలో డ్రైనేజీల నుంచి మురుగును తొలగించి రోడ్లపై వేయడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధితపై అధికారులు స్పందించి మురుగును తొలగించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి సాధిక్‌ను వివరణ కోరగా పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో ఆలస్యమైంది. తక్షణమే గ్రామ పంచాయతీ సిబ్బందితో మురుగును తొలగిస్తామని తెలిపారు.

రోడ్డుపై వేసిన మురుగు కుప్పలు

## ముగిసిన రాచూర్ ప్రీమియర్‌లీగ్ టోర్నమెంట్

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వెల్దండ, మే 15 : మండలంలోని రాచూర్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న రాచూర్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ముగిసాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గ్రామానికి చెందిన ఎస్వీ లెవన్ టీం మొదటి విజేతగా నిలవగా, గోకమల్ల ఫైటర్ టీం రెండో విజేత, పీవీ రాకెట్ టీం మూడో విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు రాజు తెలిపారు. అనంతరం గెలుపొందిన విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రావణ్, ప్రశాంత్, రాజు, సురేందర్, వెంకటేశ్, డీఎం వెంకటేశ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ఊర్కొండ, మే 15 : మండల కేంద్రానికి చెందిన నేరాలపల్లి గండెమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పలువురు కాంగ్రెస్ నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో సంతోష్‌రెడ్డి, కతం యాదయ్య, షబ్బీర్, చందు, ఆంజనేయులు, వెంకటయ్య తదితరుల ఉన్నారు.

## పీయూలో క్యాంపస్ కనెక్ట్ యాప్ ప్రారంభం

పాలమూరు, మే 15 : పాలమూరు విశ్వవిద్యాలయంలో జనసిస్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు లైబ్రరీలో మేనేజ్‌మెంట్ సిస్టం(క్యాంపస్ కనెక్ట్ యాప్)ను బుధవారం అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ తమ చాంబర్‌లో క్యాంపస్ కనెక్ట్ అనే యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా లైబ్రరీలో ఎన్ని పుస్తకాలు ఉన్నాయి, ఏ పుస్తకం ఎవరి దగ్గర ఉన్నది అని స్టాక్ ఎంట్రీలో వివిధ పుస్తకాలు మొదలగు వివరాలన్నీ ప్రతి విద్యార్థికి ఖచ్చితమైన సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, లైబ్రరీ కోఆర్డినేటర్ అనురాధా రెడ్డి, ప్రిన్సిపాళ్లు చంద్రకిరణ్, అంకం భాస్కర్, యాప్ రూపకర్త విక్రమ్‌రెడ్డి, నందిని తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ కళాశాలల్లో

## ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్, మే 15: 2024-25 విద్యా సంవత్సరంలో కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 15 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామ్‌లాల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024 పదో తరగతిలో 7.0 జీపీ, ఆపైన జీపీ సాధించిన జిల్లా పరిషత్, తెలంగాణ రెసిడెన్షియల్, ఎయిడెడ్, బెస్ట్ అవెలబుల్, నవోదయ, తెలంగాణ ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తిగల ఎస్సీ,ఎస్టీ, బీ.సీ , మైనార్టీ విద్యార్థులు http//telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా సంబంధిత ధ్రువికరణపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## అమ్మవారికి బంగారు గొలుసు వితరణ

అచ్చంపేటరూరల్, మే 15: మండలంలోని ఉమామహేశ్వరాలయంలో కొలువైన పార్వతీదేవికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన రమ్య, రమాకాంత్‌గౌడ్ దంపతులు రూ.80వేల విలువైన 10.290 గ్రాముల బంగారు గొలుసును వితరణ చేశారు. ఆభరణాన్ని ఆలయ చైర్మన్ కందూరు సుధాకర్‌కు అందజేసినట్లు వారు తెలిపారు. కార్యకమంలో ఈవో శ్రీనివాసరావు, అర్చకులు వీరయ్యశాస్త్రి ఉన్నారు.

## వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

కల్వకుర్తి, మే 15: కల్వకుర్తి మండలంలో రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కల్వకుర్తి మండలం మార్చాల సమీపంలో బుధవారం రాత్రి సూర్యలతా కాటన్ మిల్లు వద్ద సంజాపూర్ గ్రామానికి చెందిన శ్రీహరి ద్విచక్ర వాహనంపై నుంచి అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని స్థానికులు చికిత్స కోసం దవాఖానకు తరలించారు. అదే విధంగా తర్నికల్ గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో రాచాలపల్లికి చెందిన వెంకటయ్య, కల్వకుర్తికి చెందిన అంజయ్య, సతీశ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వదవాఖానకు తరలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# నర్సులు.. గొప్ప సేవాపరులు

- జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ రఘు
- ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నాగర్‌కర్నూల్ : నర్సులను సన్మానిస్తున్న డాక్టర్ రఘు

నాగర్‌కర్నూల్, మే 15: నర్సులు గొప్ప సేవాపరులని నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రఘు అన్నారు. బుధవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి రోజుల్లో వారికి సేవ చేసే నర్సులను గౌరవించడం సమాజంలో ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం నర్సుల సన్మానించారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ ఫౌండర్ రాఘవేందర్, రాష్ట్ర అధ్యక్షుడు యశోదారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు భాగ్యమ్మ, డివిజన్ అధ్యక్షుడు రమణ, క్లాస్‌మేట్స్‌క్లబ్ సభ్యులు రామచందర్, సభ్యులు, ఆర్ఎంవో డాక్టర్ దశరథం, హెచ్‌వోడీ డాక్టర్ శేఖర్, డాక్టర్ రోహిత్, డాక్టర్ రాజేశ్, నర్సింగ్ సూపరింటెండెంట్ లలిత తదితరులు పాల్గొన్నారు.

### కల్వకుర్తిలో..

కల్వకుర్తి, మే 15 : క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖానలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. దవాఖానలో పనిచేస్తున్న 11 మంది స్టాఫ్ నర్సులను శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమం లో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనర్సింహారావు, సభ్యులు రాజేందర్, శ్రీధర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

### నర్సులకు సన్మానం

పెద్దకొత్తపల్లి, మే 15: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని క్లాస్‌మేట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నర్సులను సన్మానించారు. ఈ సందర్భంగా క్లాస్‌మేట్స్‌క్లబ్ అధ్యక్షురాలు శోభ మాట్లాడుతూ దవాఖానల్లో ప్రజలకు వైద్య సేవలందించడంలో నర్సుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దవాఖాన సిబ్బంది ఎల్ఎన్‌గౌడ్ పాల్గొన్నారు.

కల్వకుర్తి : నర్సులను సన్మానిస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

పెద్దకొత్తపల్లి : నర్సులను సన్మానిస్తున్న క్లాస్‌మేంట్ క్లబ్ సభ్యులు

# మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి

- క్వింటాకు గరిష్ఠంగా రూ.2,319

నవాబ్‌పేట మార్కెట్ యార్డులో సన్నరకం ధాన్యం

దేవరకద్ర, మే 15 : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఉల్లిని విక్రయానికి తీసుకొచ్చారు. మార్కెట్‌కు 105 క్వింటాళ్ల ఉల్లి విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,319, కనిష్ఠంగా రూ.2,062 ధర పలికింది. మార్కెట్ నిబంధనల ప్రకారం 45కిలోలు తూకం వేసి విక్రయించారు. మార్కెట్లో ధరలు లభించని రైతులు టెండర్లకు వెళ్లకుండా నేరుగా విక్రయాలు సాగించారు.

### ఆర్ఎన్ఆర్@రూ.2,420

జడ్చర్ల, మే 15 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,420 ధర పలికింది. బుధవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు 6,559 క్వింటాళ్ల ఆర్ఎర్ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,420, కనిష్ఠంగా రూ.1,901, మధ్యస్తంగా రూ.2,129 ధర లభించింది. అదేవిధంగా మార్కెట్ కు 97క్వింటాళ్ల హంసరకం ధాన్యం రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.1969 ధర పలికింది. వేరుశనగ క్వింటాకు గరిష్ఠంగా రూ.5,920, కనిష్ఠంగా రూ.4,710 , మధ్యస్తంగా రూ.5,760 ధర వచ్చింది. ఆముదాలు క్వింటాకు గరిష్ఠంగా రూ.5,546, మొక్కజొన్న క్వింటాకు రూ.2,274, జొన్నలు క్వింటాకు గరిష్ఠం గా రూ.4,677, రాగులు క్వింటాకు గరిష్ఠంగా రూ. 2, 902 ధర పలికినట్లు మార్కెట్అధికారులు తెలిపారు.

### నవాబ్ పేట మార్కెట్‌కు భారీగా ధాన్యం

నవాబ్‌పేట, మే 15 : నవాబ్‌పేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఐదారు రోజులుగా ధాన్యం భారీగా వస్తోంది. ముఖ్యంగా ఆర్ఎన్ఆర్ ధాన్యానికి మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండడంతో మండలంలో అధికంగా సన్నరకం ధాన్యాన్నే రైతులు అధికంగా పండించారు. బుధవారం ఒక్క రోజే మా ర్కెట్ యార్డుకు ఆర్ఎన్ఆర్ సన్నరకం ధాన్యం 20,707బస్తాలు వచ్చింది. స న్నరకం ధాన్యానికి గరిష్ఠంగా క్వింటాకు రూ.2,507, కనిష్ఠంగా రూ. 1,912 ధర వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తెలిపారు. దొడ్డురకం ధాన్యానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,058 ధర లభించినట్లు ఆయన వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమయానికి టెండర్లు వేసినట్లు ఆయన తెలిపారు.

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లికి టెండర్లు వేస్తున్న దృశ్యం

# మూడు కౌంటర్లు చూసేది ఒక్కరే..

- పోస్టాఫీస్‌లో సిబ్బంది లేక వినియోగదారుల ఇక్కట్లు
- పనుల కోసం గంటల తరబడి నిరీక్షణ

కల్వకుర్తి, మే 15: కల్వకుర్తి పట్టణంలోని తపాలా కార్యాలయంలో సిబ్బంది లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన కల్వకుర్తి తపాలా కార్యాలయంలో గత వారం రోజుల నుంచి పోస్టుమాస్టర్ ఒక్కడే విధులు నిర్వహిస్తుండటంతో ఆర్‌పీఎల్,ఆర్డీలు, ఖాతాల్లో డబ్బులు జమచేయడానికి వెళ్తే గంటల తరబడి కార్యాలయంలో నిరీక్షించాల్సి వస్తున్నదంటున్నారు. కల్వకుర్తి పట్టణంలో దాదాపు 40 వేల జనాభా, 30కి పైగా విద్యాసంస్థలు, 20 ప్రభుత్వ కార్యాలయాలు, ఎనిమిది బ్యాంకులు ఉన్నాయి. పట్టణవాసులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు కూడా కల్వకుర్తి పోస్టాఫీసుకు వస్తుంటారు. వారం రోజుల క్రితం వరకు ఈ పోస్టాఫీస్‌లో తాత్కాలిక పద్ధతిపై ముగ్గురు పనిచేసేవారు. వారిని ఉన్నతాధికారులు తొలగించడంతో పోస్టుమాస్టర్ ఒక్కరే రెండు మూడు కౌంటర్లలో పని చేస్తున్నారు. ఆయన ఒక్కో కౌంటర్‌లో గంట, అరగంట పనిచేస్తుండటంతో మిగితా పనులు వదులుకొని గంటల తరబడి ఇక్కడే నిరీక్షించాల్సి వస్తున్నదని ఖాతాదారులు, వినియోగదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. ఈ విషయంపై పోస్టుమాస్టర్‌ను వివరణ కోరగా సిబ్బంది లేక పోవడంతో మూడు కౌంటర్లను తానొక్కడినే చూసుకోవాల్సి వస్తుందన్నారు. దీంతో ఖాతాదారులకు కొంత ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించినట్లు తెలిపారు.